క్లుప్తంగా

జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ, పీఈటీలు

ధర్మవరం అర్బన్: జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు బీఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు 14 మంది ఎంపికైనట్లు హెచ్‌ఎం జ్యోతి తెలిపారు. పట్టణంలోని బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. ఈ నెల 2, 3 తేదీలలో నరసరావుపేటలోని ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో ధర్మవరం విద్యార్థినులు ప్రతిభచూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. అండర్–14, అండర్–19 విభాగాలలో పాల్గొని ద్వితీయస్థానం సాధించారన్నారు. దీంతో సెప్టెంబర్‌లో బిహార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాఠశాల విద్యార్థినులు పాల్గొననున్నారని పీడీ లక్ష్మీనారాయణ, పీఈటీలు లక్ష్మీనారాయణ, పద్మావతి, ఉపాధ్యాయులు తెలిపారు.

ఆటో దొంగ అరెస్ట్

కదిరి టౌన్: ఆటోను దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన జొన్నాడ హుస్సేన్ పీరాకు చెందిన ఆటో ఈ నెల పదో తేదీన చోరీకి గురైంది. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం కుటాగుళ్ల రైల్వేగేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను తనిఖీ చేయగా.. చోరీకి గురైనదని తేలింది. ఆటోను దొంగిలించిన సైదాపురానికి చెందిన చిట్టివడ్డి మురళీకృష్ణను అరెస్టు చేసి, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు.

సీనియర్స్ మహిళా క్రికెట్ జట్టుకు కదిరి క్రీడాకారిణులు

కదిరి అర్బన్: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలో అంతర్ జిల్లాల సీనియర్స్ మహిళా క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారిణులు అర్షియా నేహా, తేజశ్విని ఎంపికయ్యారు. అర్షియా కుడిచేతి ఓపెనింగ్ బ్యాటర్ కాగా, తేజశ్విని కుడిచేతివాటం మీడియం పేస్ బౌలర్.

కదిరి విద్యార్థులకు పతకాలు



గోల్డ్ మెడల్స్ సాధించిన కదిరి విద్యార్థులు

కదిరి అర్బన్: కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూర్‌లో ఈ నెల 10న జరిగిన జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్‌లో కదిరి విద్యార్థులు కథాస్ విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ అక్బర్ అలీ సోమవారం తెలిపారు. బ్రౌన్‌బెల్ట్ విభాగంలో మహ్మద్ అసద్, పర్పుల్ బెల్ట్ విభాగంలో హనికా రాయల్, గ్రీన్‌బెల్ట్ విభాగంలో బధ్రి, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో సాయి కార్తీక్ గోల్డ్ మెడల్స్ సాధించారు. విజేతలకు టోర్నమెంట్ ఆర్గనైజర్ శ్రీనాథ్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

ద్విచక్రవాహనదారునికి గాయాలు

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. నడింతండాకు చెందిన రవీంద్రానాయక్ సోమవారం బైక్‌పై అమడగూరు వైపు బయల్దేరాడు. కుమ్మరిల్లు దగ్గరకు రాగానే మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రవీంద్రానాయక్ కాలుకు బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు.

భూములు ఆక్రమిస్తే కేసులు

ఎన్‌పీకుంట: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ దేవేంద్రనాయక్ హెచ్చరించారు. ఎన్‌పీకుంట సమీపంలోని వంకమద్దిక్రాస్ వద్ద సర్వే నంబరు 43లో గల ప్రభుత్వ భూమిని సోమవారం సర్వేయర్లతో కలిసి తహసీల్దార్ సర్వే చేయించారు.

షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

ధర్మవరం రూరల్: జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల జట్లకు క్రీడాకారుల ఎంపిక కోసం పోటీలు నిర్వహించారు. ఇందులో ధర్మవరం పట్టణంలోని రిషి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఎస్.వి.సిరి, వై.శాలిని, పి.షణ్ముక కుమార్ ఎంపికైనట్లు పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ కరణ్ స్వరూపాసింగ్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, సీఏఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి, పీఈటీ గణేష్ అభినందించారు.

సర్పంచ్‌కు గాయాలు

కదిరి అర్బన్: ఎగువపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ ఈశ్వరయ్యకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణికంఠనాయక్ తదితరులు సర్పంచ్‌ను పరామర్శించారు.



నల్లచెరువు విజయలక్ష్మి కాలనీలో ఇళ్ల మధ్యే మురుగునీరు



నల్లచెరువులోని విజయలక్ష్మి కాలనీలో పేరుకుపోయిన చెత్త, కంపచెట్లు



పుట్టపర్తిలోని ఎనుములపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద పాచి పట్టిన వీధి

పారిశుధ్యం.. అధ్వానం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించింది. అసలే వర్షాకాలం. రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. వర్షాలు పడినపుడు డ్రెయినేజీలు పొంగుతున్నాయి. రోజుల తరబడి నీరు నిలిచి పోవడం.. ఎక్కడపడితే అక్కడ అపరిశుభ్రత పేరుకుపోవడం, దోమల బెడద అధికం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- ముందుకు కదలని మురుగు
- నామమాత్రంగానే పారిశుధ్య చర్యలు
- దుర్వాసనతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- వర్షాలతో సీజనల్ వ్యాధులు విస్తరిస్తాయేమోనన్న భయం

గ్రౌండ్ రిపోర్ట్



పుట్టపర్తి సమీపంలో రాయలవారిపల్లికి వెళ్లే వీధిలోని గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



జేకేపల్లిలోని ప్రధాన వీధిలో నిలిచిన నీరు

పుట్టపర్తి అర్బన్/ నల్లచెరువు: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తితో పాటు శివారు గ్రామాలు చెత్తా చెదారంతో పాటు బురదమయమై, పాచి పట్టి దుర్వాసన వస్తోంది. ప్రధాన వీధుల్లో తప్ప ఎక్కడా చెత్తా చెదారం, వీధుల్లో పేరుకున్న మట్టి తొలగించడం లేదు. ఎక్కడైనా సమస్య ఉందని సోషల్ మీడియాలో వైరల్ అయితే అధికార యంత్రంగం స్పందించి తూతూమంత్రంగా శుభ్రపరచడం, బ్లీచింగ్ చల్లడం చేస్తున్నారు. ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే వారు లేరు. అటు మున్సిపల్ సిబ్బంది, ఇటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సరిగా స్పందించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే కొనసాగితే సీజనల్ వ్యాధులతో పాటు అతిసార, డెంగీ, చికున్‌గన్యా, టైఫాయిడ్ వంటి జబ్బులు ప్రబలే ప్రమాదం ఉంది. పారిశుధ్యం మెరుగునకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- పుట్టపర్తిలోని ఎనుములపల్లి వీధుల్లోని గుంతల్లో వర్షపు నీళ్లు నిలిచాయి. ఇక అంగన్‌వాడీ కేంద్రం వద్ద బురద పేరుకుపోయింది. దోమలు విపరీతంగా ముసురుకుంటున్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు నిత్యం ఏదో ఒక జబ్బుతో ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు వర్షపు నీరు, బురదలో జారి గాయాలపాలవుతున్నారు. ఈ విషయమై ఎనుములపల్లి వైద్యాధికారి డాక్టర్ నాగదుర్గను వివరణ కోరగా వర్షాలు తగ్గుముఖం పట్టగానే మున్సిపాలిటీ అధికారులు, సిబ్బందితో కలిసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, అబేట్ మందు పిచికారీ చేయించడం, దోమలు అధికంగా ఉన్నచోట ఫాగింగ్ చేయించడం వంటి చర్యలు చేపడతామని చెప్పారు.

వర్షపునీటి నిల్వతో బేజారు

ముదిగుబ్బ: జొన్నలకొత్త (జేకే) పల్లిలోని ప్రధాన వీధిలో వర్షపు నీరు నిలిచింది. రోజులతరబడి అలానే ఉండటంతో దుర్వాసన వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆ దారిలో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అంటున్నారు.

కంటిపై కునుకుండటం లేదు



మండల కేంద్రం నల్లచెరువులోని విజయ లక్ష్మి కాలనీలో మురుగునీరు కంపు కొడుతోంది. డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో కాలనీలోని రోడ్లపై, నివాసల ముందు మురుగు పారుతోంది. ఇళ్ల పక్కన చెత్త పేరుకుపోవడంతో దోమలు పెరిగిపోయాయి. చీకటి పడితే చాలు కాలనీలో దోవలు స్వైర విహారం చేస్తున్నాయి. బయట కూర్చునే పరిస్థితి కూడా లేదు. రాత్రి సమయంలో దోమల ధాటికి కంటి మీద కునుకు ఉండడం లేదు. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలి.

– రెడ్డెప్ప, విజయలక్ష్మి కాలనీ, నల్లచెరువు

డ్రైనేజీలు లేక గ్రామీణుల ఇక్కట్లు



యలకుంట్లలో డ్రైనేజీలు లేక వీధుల్లో నిలిచిన వర్షపు నీరు



వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతూ వెళ్తున్న ప్రజలు

కనగానపల్లి: గ్రామీణ ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని యలకుంట్ల గ్రామంలోని ప్రధాన వీధుల్లో డ్రైనేజీలు లేకపోవటంతో వర్షపు నీరంతా రోడ్లపై నిలుస్తోంది. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని పలు వీధుల్లో నీరంతా రోడ్లపై ప్రవహిస్తుండటంతో స్థానిక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే మురుగుపై నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సూపర్ కాదు.. డూప్ పథకాలు



నల్లమాడ మండలం పెమనకుంటపల్లి తండాలో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



బుక్కపట్నం మండలం మారాలలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం
- అధికారంలోకొచ్చాక హామీల విస్మరణ
- ప్రజలను నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే
- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

నల్లమాడ/ పుట్టపర్తి: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించిన 'సూపర్ సిక్స్'.. డూప్ పథకాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం నల్లమాడ మండలం పెమనకుంటపల్లి తండా పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ ఆనంద్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, అలాగే బుక్కపట్నం మండలం మారాల, యాదలంకపల్లి పంచాయతీల్లో మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప ఆధ్వర్యంలో ×బాబు షూరిటీ..మోసం గ్యారెంటీ₹ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల హామీలను గుర్తు చేస్తూ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. హామీలు అమలు చేయకపోవడంతో ఒక్కో కుటుంబం ఎంతమేరకు నష్టపోయిందో వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అలవికాని హామీలు ఇవ్వడం.. అమలు చేయకుండా ప్రజలను మోసగించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటుగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. ఏడాది గడిచిపోయినా ఎన్నికల హామీల్లో కీలకమైన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్ తదితర పథకాల ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రజల సంక్షేమం ఏమాత్రమూ పట్టడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా, బైబిల్‌గా, ఖురాన్‌గా భావించి పూర్తిస్థాయిలో హామీలను అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. పెమనకుంటపల్లి తండా పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, సర్పంచ్ ఆనంద్‌నాయక్, నాయకులు నాగరాజునాయుడు, సర్పంచ్‌లు కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, మండల కమిటీ సభ్యులు షంషీర్, యర్ర సూరి, మాజీ డీలర్లు బాలాజీనాయక్, మాధవరెడ్డి, వెంకటేష్‌నాయక్, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, మంగేనాయక్, రామక్రిష్టారెడ్డి, చంద్రహాసరెడ్డి, మాధవరెడ్డి, గోవిందరెడ్డి, ఏఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్ యాదవ్, రంగారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాసం శివారెడ్డి, ఆర్‌పీ రమేష్‌నాయక్, గణేష్‌నాయక్, కేశవనాయక్, జగదీష్ నాయక్, వెంకటేష్‌నాయక్, తిరుపాల్‌నాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. బుక్కపట్నం మండలంలో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి,ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి,వైస్ ఎంపీపీ ఆదినారాయణ, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, గశికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు విజయారెడ్డి, మాజీ సర్పంచ్ గంగమనాయుడు, మండల మైనార్టీ కన్వీనర్ రఫీ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, సీనియర్ నేత మాజీ ఎంపీపీ రంగారెడ్డి, ,మండల బూత్ లెవల్ కమిటీ మేనేజర్ పతంజలి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎల్ ఐసీ చంద్ర, మండల ప్రధాన కార్యదర్శులు పూలకుంట్ల నాగభూషణ, గోపీ స్వామి, ఎస్సీ సెల్ విభాగం మండల శాఖ అధ్యక్షుడు నీలూరి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో భారీ వర్షం



ఉధృతంగా పారుతున్న ముచ్చిరామి వంక

ధర్మవరం రూరల్: ధర్మవరం వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు వర్షాలు కురిశాయి. ధర్మవరం మండలంలో 67.4 మి.మీ భారీ వర్షం పడింది. ఇక బత్తలపల్లి 14.2, తాడిమర్రి 24.2, ముదిగుబ్బ 24.8, కనగానపల్లి 30.8, చెన్నేకొత్తపల్లి 25.4, రామగిరి 6.2 మి.మీ వర్షపాతం నమోదైందని డిప్యూటీ ఎస్‌ఓ గోపాల్ తెలిపారు. వర్షాలకు వంకలు పొంగిపొర్లాయి. చెక్ డ్యాంలలోకి నీరు చేరింది.

వర్షాలకు కూలిన ఇల్లు

పుట్టపర్తి అర్బన్: బొంతలపల్లిలో తొమ్మిది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చంద్రాయుడు ఇల్లు సోమవారం కూలింది. రెండు గదులు ఉన్న ఇంటిలో ఒక గదిలో కుటుంబ సభ్యులు పడుకొని ఉండగా.. పక్క గది పైకప్పు పూర్తిగా కూలిందని చంద్రాయుడు పేర్కొన్నారు. దీంతో గదిలో ఉన్న టీవీ, బియ్యం ప్యాకెట్లు, గ్యాస్ స్టవ్, వంటపాత్రలు, ఫ్యాన్ తదితర సామాగ్రి దెబ్బతిన్నాయి. రూ. లక్ష నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని తహసీల్దార్ కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు.

చినుకుపడితే చిత్తడే

కదిరి అర్బన్: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చినుకు పడితే చిత్తడిగా మారిపోతోంది. వర్షపునీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వివిధ పనులపై వచ్చే ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు దాడి చేస్తుండటంతో రోగాలు వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు



రోడ్డును మరమ్మతు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం రూరల్: ఛిద్రమైన రోడ్లకు అధికారులు ప్యాచ్ వర్క్‌లు చేపడుతున్నారు. రెండు రోజుల క్రితం 'అద్దాల్లా అన్నారు... అధ్వానంగా మార్చారు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. మామిళ్లపల్లి వైపు వెళ్లే రహదారిలో యంత్రాలతో మరమ్మతులు ప్రారంభించారు. రోడ్లు పాడైన చోట్ల పై భాగం తొలగించి వాటిని కంకర, తారుతో ప్యాచ్ వర్క్ చేపడుతున్నారు.

అధ్యాపకుల నిరసన

కదిరి అర్బన్: సాధారణ బదిలీలు చేపట్టలేదని ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాలుగైదు నెలలుగా సాధారణ బదిలీలు చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదించినా ఫలితం లేదన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు పూర్తయ్యాయని, తమకు మాత్రం ఇంతవరకు బదిలీల ప్రక్రియ చేపట్టలేదన్నారు. బదిలీలు సత్వరం నిర్వహించకపోతే ఈ నెల 18న విజయవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హైదర్ అలి, నారాయణ స్వామి, నరసింహాచారి, శంకర్, క్రిష్ణానాయక్, చెన్నారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రంగమండపంలో శ్రీదేవి భూదేవి సమేత వసంతవల్లభుని కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు బాలుస్వామి స్వామివారికి అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. హోమాలు చేసి వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయ పద్ధతిలో ఖాద్రీశునికి కల్యాణోత్సవం జరిపించారు.

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన

కదిరి టౌన్: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యక్తిగత అర్జీలను సోమవారం గ్రీవెన్స్‌లో తహసీల్దార్‌కు అందజేశారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటు

ధర్మవరం అర్బన్: రానున్న ఐదురోజులు జిల్లాలో భారీ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉండటంతో ధర్మవరం డివిజన్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆర్డీఓ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (98660 57959) ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో 9553 929724, బత్తలపల్లి 79897 22695, తాడిమర్రి 93911 64803, ముదిగుబ్బ 63012 79595, చెన్నేకొత్తపల్లి 79817 34346, కనగానపల్లి 85558 28121, రామగిరి తహసీల్దార్ కార్యాలయంలో 88972 31796 నంబర్లతో కమాండ్ కంట్రోల్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితులు, అవాంఛనీయ ఘటనలు ఎదురైతే తహసీల్దార్ కార్యాలయాల్లోని కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఫోన్ నంబర్లను సంప్రదించి సహాయం పొందవచ్చన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నున్న శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో 354వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామలాలిత్య ఆధ్వర్యంలో 18 మంది శిష్య బృందం చేసిన నాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఆలయంలో జరుగుతున్న ఆరాధన ఉత్సవాల్లో భాగంగా నాట్య ప్రదర్శనలో నటరాజు, వినాయకుడు, లక్ష్మీ మొదలైన దేవతల కీర్తనలు, కూచిపూడి నృత్యాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నాట్య గురువులు, శిష్యులను శాలువాలతో సత్కరించారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

బత్తలపల్లి: బత్తలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 18 కేసుల్లో పట్టుబడిన 163 ఏపీ మద్యం బాటిళ్లు, కర్ణాటకకు చెందిన 63 మద్యం బాటిళ్లను ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి గోవింద్‌నాయక్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్, వీఆర్‌ఓలు రాణా ప్రతాప్, చెన్నకేశవ ప్రసాద్ ఆధ్వర్యంలో సమీపంలోని చెరువు వద్ద ధ్వంసం చేశారు.

వీఆర్‌ఏ మృతి

గాండ్లపెంట: సోమయాజులపల్లి వీఆర్‌ఏ ఓబన్న (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతదేహాన్ని తహసీల్దార్ బాబూరావు, సహచర సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25 వేలను మృతుని భార్య రామక్కకు అందించారు.

బ్రేక్‌డౌన్ కాకుండా చూడండి

కదిరి అర్బన్: స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయనున్న దృష్ట్యా బస్సులు బ్రేక్‌డౌన్ కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ నాగరాజు కదిరి డిపో గ్యారేజీ సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి డిపోను పరిశీలించారు.

నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

నల్లచెరువు: వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్షుడు యర్రగుంటపల్లికి చెందిన కమ్మల వెంకటరమణ, డైరెక్టర్లు అల్లుగుంటి గంగులప్ప, అంజనప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు.

టైలు అందజేత

కదిరి అర్బన్: మండలంలోని చిగురుమాను తండా, గొల్లోళ్ల చెరువు, చవిటితండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 80 మంది పిల్లలకు సోమవారం హార్ట్ టుహెల్ప్ సంస్థ నిర్వాహకులు రవినాయక్ టైలు అందజేశారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

తనకల్లు: ఆర్డీటీ సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని తనకల్లు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఐదు దశాబ్దాల పైబడి పేదలకు విద్య, వైద్య రంగాలతో పాటు పక్కాగృహాల నిర్మాణంతో సేవలందిస్తున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

క్రీడా సామగ్రి వితరణ

చెన్నేకొత్తపల్లి: మేడాపురం ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి కేశవరెడ్డి సోమవారం రూ.30 వేలు విలువైన క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ధర్మవరం అర్బన్: క్షయవ్యాధిగ్రస్తులకు సోమవారం ఏరియా ఆస్పత్రిలో పౌష్టికాహారం అందించారు. సంగ్వా హైటెక్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ వారు అందించిన కంది పప్పు, వేరుశనగ విత్తనాలు, శనగలు, గోధుమపిండి, రాగిపిండి, పామాయిల్, కోడిగుడ్లను అందజేసినట్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, జిల్లా క్షయవ్యాధి నివారణ మెడికల్ ఆఫీసర్ గాయత్రి వెల్లడించారు.

సాగునీరందించడంలో విఫలం

ఎన్‌పీకుంట: హంద్రీ- నీవా సుజల స్రవంతి కాలువల ద్వారా సాగునీటిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నాయకులు విమర్శించారు. హంద్రీ నీవా కాలువ పనులు పూర్తి చేసి చెరువులకు నీరు విడుదల చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతి పత్రం అందించారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్

బత్తలపల్లి/ తాడిమర్రి: ఆల్బెండజోల్ మాత్రల ద్వారా పిల్లల్లో నులిపురుగులను నివారించవచ్చని ఎన్‌డీడీ ప్రోగ్రాం స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. మంగళవారం నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పరిశీలించడానికి ఆయన సోమవారం బత్తలపల్లి, తాడిమర్రిలో పర్యటించారు.